# కొత్త అల్లుడు

**మి**త్రుడు వెంకటరత్నం తన కూతురు వివాహ నిశ్చితార్థానికి ఆహ్వానిస్తే ఆ రోజు స్కూల్‌కు సెలవు పెట్టి, ఉదయం పది గంటలకల్లా అతని ఇంటికి చేరుకున్నాను. బలవంతపెట్టి ఆహ్వానిస్తే కాదనలేక వెళ్ళినాను గాని, నాకు ఈ వివాహ నిశ్చితార్థాల వేడుకలకు వెళ్లటం ఏ మాత్రమూ ఇష్టం ఉండదు. నిశ్చితార్థాలు కేవలం వధూవరుల కుటుంబాలు మాత్రం కలిసి, చేసుకోవటమే న్యాయం. పెళ్ళికి ఎటూ బంధుమిత్రులందరినీ పిలవక తప్పదు. నిశ్చితార్థాలకు కూడా అందర్నీ ఆహ్వానించి ఆడంబరంగా చేయటం ఈ పదేళ్లలో బాగా ముదిరిపోయింది. ఫోటోలూ, వీడియోలూ, బట్టలు యిచ్చుకోటాలూ, ఉంగరాలు మార్చుకోటాలూ, అతిథి మర్యాదలూ, విందులూ ఈ అట్టహాసం ఖర్చు అంతా ఆడపిల్ల తండ్రికే గదా! ఎగువ మధ్యతరగతిని చూసి తెచ్చిపెట్టుకున్న వాత ఇది. ఆడపిల్ల తండ్రిని బలి పెట్టడానికి ఎన్నెన్ని మార్గాలు వుంటాయో అన్నీ ఎప్పటికప్పుడు ఈ సమాజం వెదుకుతూ వుంటుంది.

వెంకటరత్నంకు ముగ్గురు కూతుళ్ళు. పెద్దమ్మాయిలిద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. ఈ అమ్మాయి చివరిది. 'నిశ్చితార్థం వేడుకలెందుకురా' అంటే, 'నా చేతుల్లో ఏమీ లేదు' అన్నాడతడు. నిజమే! అంతా బలవంతంగా రుద్దే వ్యవహారమే గదా! పెళ్ళి చూపులు కాగానే, మరి నిశ్చితార్థం ఎప్పుడు పెట్టుకుంటారు అంటారు మధ్యవర్తులు. మేము ఇంత మంది వస్తాము అంటారు. "అలా కుదరదు, మీ ఇంటివాళ్ళు మాత్రమే రండి." "లగ్నపత్రిక రాసుకుందాం" అని ఆడపిల్ల తండ్రి నిర్మొహమాటంగా అనలేడు గదా! ఇక అక్కడి నుండీ శిక్షలు ప్రారంభం! అందుకే నా చేతుల్లో ఏమీ లేదు అని వెంకటరత్నం అనగలిగినాడు!

నేను వెళ్ళేసరికే, మిత్రులూ, బంధువులూ, చాలామంది షామియానా కింద కుర్చీల్లో కూచొని వున్నారు. వెంకటరత్నంను పలకరించి నేనూ అందరి మధ్య కూర్చున్నాను. పెళ్ళికొడుకు బృందం గంట క్రితం హిందూపురం నుండీ బయలుదేరినారట. మరో గంటకల్లా రావచ్చునన్నారు.

అనుకున్న సమయానికి ఒక గంట ఆలస్యమైనప్పటికే పెళ్ళి కొడుకు బృందం ఒక పెద్ద బస్సులోనూ, రెండు టాటా సుమోల్లోనూ అట్టహాసంగా, హుందాగా అక్కడికి చేరుకున్నారు. పెళ్ళికొడుకు బంధువులూ, మిత్రులూ వారి బంధు బంధువులూ వీళ్లందరి పరిచయాల కార్యక్రమం అరగంట సాగింది. నేను ఆ సంరంభాన్నంతా ప్రేక్షక మాత్రుడిగా చూస్తుండిపోయాను.

పెళ్ళికొడుకు పొడుగ్గా, చాకులా వున్నాడు. బ్యాంక్ ఉద్యోగి అట! వెంకటరత్నం నన్ను పరిచయం చెయ్యబోతే, అతడే ముందుగా “నమస్కారం సార్! నేను సుధాకర్‌ను! మీ స్టూడెంట్‌ను. మీరు కొత్తపల్లిలో పని చేసేటప్పుడు మీ దగ్గర చదువుకున్నాను”. అంటూ తన్ను పరిచయం చేసుకున్నాడు – ఎందరో విద్యార్థులు! అందర్నీ గుర్తుపట్టగలనా? “అలాగా నాయనా? చాలా సంతోషం! నువ్వు మా వెంకటరత్నం అల్లుడు కావడం మరీ సంతోషం” అన్నాను మెచ్చుకోలుగా. సుధాకర్ నా ఎదుట కూచుని గత జ్ఞాపకాల్ని కొన్ని నాకు గుర్తు చేస్తున్నాడు. వెంకటరత్నం ఏర్పాట్ల కోసం లోపలకు వెళ్లినాడు. మేమిద్దరం మాటల్లో మునిగిపోయాము.

అరగంట తర్వాత పిలుపు వచ్చింది. అందరూ హాల్లోకి వెళ్లాము. నిశ్చితార్థ వేడుకలు ప్రారంభమైనాయి. వధూవరులను సింహాసనం లాంటి కుర్చీల్లో ఆసీనుల్ని చేశారు. వధువు తల్లిదండ్రులూ, వరుని తల్లిదండ్రులూ, వేదిక మీదకు వచ్చి, వాళ్లకు నూతన వస్త్రాలను అందించి ఆశీర్వదించినారు. నూతన వస్త్రధారణ కోసం వధూవరులు లోపలి గదుల్లోకి వెళ్లినారు. వచ్చిన బంధు మిత్రులతో హాలు కిటకిటలాడి పోతోంది. పట్టుచీరల రెపరెపలు, మల్లెపూల గుబాళింపులు, అగరువత్తుల పరిమళాలు, గాజుల సవ్వడులు, వీటితో వాతావరణమంతా శోభాయమానమై పోయింది. ఇంటికంతా పెళ్లి కళ వచ్చేసింది. అటు వెంకటరత్నం సన్నిహిత బంధువులూ, మిత్రులూ వరుని తరుపున బంధుమిత్రులూ, ఒకరినొకరు పలకరింపులూ, చమత్కారాలూ, బంధుత్వాలను తిరగతోడుకోవటాలూ, వధూవరులను మెచ్చుకోవటాలూ, ఇలా అంతా సందడి సందడిగా వుంది.

వధువు ఈ మధ్యనే బి.యిడి., కూడా పూర్తి చేసింది. రేపో మాపో జరిగే డి.ఎస్.సి.లో ఉద్యోగం కూడా సంపాదించవచ్చు. పెద్దమ్మాయిలు ఇద్దరి పెళ్లిళ్లూ చేసేసరికి వెంకటరత్నం సగం నడ్డి విరిగిపోయింది. అతని ఆర్థిక పరిస్థితి నాకు తెలుసు. పెద్దమ్మాయికి లక్ష కట్నమూ, పదితులాల బంగారమూ యిచ్చి సమీప

బంధుత్వంలోనే యిచ్చి పెళ్లి చేశాడు. రెండు సంవత్సరాలు దాటక ముందే రెండో అమ్మాయికీ సంబంధం కుదిరింది. కొత్త సంబంధం, కుర్రాడు టీచరు, అతనికీ రెండు లక్షల దాకా కట్నమివ్వాల్సి వచ్చింది. ఉన్న వూళ్లో పదెకరాల మెట్ట అమ్మి ఆ పెళ్లి జరిపించాడు. ఈ అమ్మాయి పెళ్ళికొచ్చేసరికి వెంకటరత్నం పూర్తిగా నిర్ధనుడై పోయినాడు.

పి.ఎఫ్.లోనూ, ఎల్.ఐ.సీ. లోనూ, ఆర్.డి. ఖాతాలూ అన్నీ తోడితే లక్ష వరకూ వచ్చింది. ఎటూ మూడేళ్ళలో రిటైర్డ్ అవబోతున్నాడు కాబట్టి, ఆ ధైర్యంతో రెండు లక్షలదాకా అప్పులు చేసినట్లు నాతో చెప్పాడీమధ్య. పెళ్ళికొడుక్కు ఇచ్చే కట్నకానుకలు ఒక ఖర్చయితే, పెళ్ళి ఖర్చు కూడా తక్కువేమీ కాదు. కళ్యాణ మండపం ఖర్చులూ, భోజనాల ఖర్చులూ, తిరుగుళ్లూ, రాకపోకలూ, ఈ ఖర్చంతా కనీసం లక్ష దాటుతుంది. ఇటీవలి రోజుల్లో దాన్ని ఆపటం ఎవరి తరమూ కాదు. ఖర్చుకు తోడు శ్రమా, నిశ్చితార్థం అయినప్పటి నుండి మళ్లీ పెళ్లయేదాకా ఒకటే టెన్షన్, హడావుడి, విపరీతమైన పనుల వత్తిడీ, పెట్టి పోతలూ, పెళ్లి పత్రికల పంపిణీ, అతిథి మర్యాదలూ, విడిది ఏర్పాట్లూ, ఇదంతా చేసేవాడికే తెలుస్తుంది.

నాకూ ఈ అనుభవాలున్నాయి కాబట్టి ఈ శ్రమ విలువ ఏమిటో నాకు తెలుసు. వెంకటరత్నం కయితే బంధు బలగం జాస్తి! ఉన్న ఇద్దరు కొడుకులూ ఇంకా చేతికందలేదు. ఇంకా చదువు సంధ్యల్లోనే వున్నారు. వాళ్లను పట్టుకొనే ఈ శ్రమనంతా పడాలి. అసలే పరీక్షల సమయాలు. దీన్నంతా నెట్టుకు రావటమంటే సామాన్యమైన విషయం కాదు. ఆత్మానుభవం అయితే గాని ఎవరికైనా తత్వం బోధ పడదు. "పెళ్లిచేసిచూడు" అని ఊరికే అనలేదు విజ్ఞులు.

అరగంట తర్వాత, నూతన వధూవరులు, కొత్త బట్టలు ధరించి వేదిక మీదకు వచ్చి, ఆసనాల నలంకరించారు. ఇద్దరూ చూడ ముచ్చటగా ఉన్నారు. ధవళ వస్త్రాలతో పెళ్ళి కొడుకూ, గులాబీ రంగు చీరతో కనకాంబరాల సింగారంతో వధువూ కనువిందు చేస్తున్నారు. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అన్న మాటను సార్థకం చేస్తున్నారు వాళ్ళిద్దరూ.

పురోహితుడు మంత్రోచ్చాటన ప్రారంభించినాడు. ప్రతి నాలుగు నిమిషాలకు కొబ్బరికాయలు కొడుతూ తీర్థాన్ని కలశాల మీద చిలకరిస్తున్నాడు. వధూవరుల తల్లిదండ్రుల గోత్రనామాలూ, ఇంటి పేర్లూ, జన్మస్థలాలూ, వధూవరుల శుభ నామాలను ఉచ్చరిస్తూ నిశ్చితార్థ సంప్రదాయ మంత్రాలను గొంతెత్తి ఉచ్చరిస్తున్నాడు.

హాల్లో కూచున్న వాళ్ళందరూ నిశ్శబ్దంగా జరుగుతున్న తంతునంతా వీక్షిస్తున్నారు. ఇలాంటివెన్నో చూసినప్పటికీ, ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా శోభిల్లే కార్యక్రమ వీక్షణలో నిమగ్నులై వున్నారు.

పురోహితుని ఆదేశానుసారం కాబోయే వధూవరులు ఉంగరాలు మార్చుకున్నారు. గులాబీ పూలదండలను మార్చుకున్నారు. ఒకరి నుదుట మరొకరు పసుపు కుంకుమల నద్దుకున్నారు. నిశ్చితార్థం ముగిసినట్టుగా అందరూ భావిస్తున్న సమయంలో "దయచేసి పదినిమిషాలు నిశ్శబ్దంగా వుంటే నేను మీ అందరికీ నా విన్నపాన్ని వినిపిస్తాను" అన్నాడు పెళ్లికొడుకు. అందరూ కించిత్ ఆశ్చర్య చకితులైన వారిలా ఒకసారిగా మాటలు ఆపి, వరుని వేపు నిశ్చలంగా చూశారు.

ఇదేమిటి? ఇదేదో కొత్తగా వుందే? నిశ్చితార్థంలో వరుని విన్నప మేమిటి? కట్నం కానుకలు చాలలేదా? లాంఛనాల కొరత ఏమైనా ఉన్నదా? పలు రకాల ప్రశ్నలు అంతరంగాల్లో సుడులు తిరుగగా, అలాగే నిశ్శబ్దులై చూస్తుండిపోయారు.

వరుడు నాలుగు నిమిషాలాగి మళ్లీ ప్రారంభించినాడు. "నిశ్చితార్థ వేడుకకు వచ్చిన మీ అందరికీ నా నమస్కారాలు. నా తల్లిదండ్రులకూ, నా అత్తమామలకూ, నాకు చదువు చెప్పిన గురువు (నా వేపు చూస్తూ) శ్రీ గంగాధరం మాస్టారు గారికీ, సాష్టాంగ ప్రణామాలు.నిశ్చితార్థంలో పాల్గొని నన్ను ఆశీర్వదించిన పెద్దలందరికీ నా వందనాలు'' అన్నాడు. అక్కడికి వచ్చిన అందరికీ వరుని ధోరణి విచిత్రమనిపించింది. ఏం చెప్పాలనుకుంటున్నాడు ఈ కుర్రవాడు? నమస్కారాలను కూడా ఈ విధంగా చెప్పడమేమిటి? అనుకుంటున్నారేమో ఆసక్తిగా చూస్తున్నారు. అందర్నీ జాగ్రత్తగా పరిశీలిస్తూనే వున్నాను.

"మీ అందరూ నేను చెప్పే మాటలను దయచేసి, ఓపికగా వినండి, నిశ్చితార్థం ముగిసింది. లగ్న నిర్ణయం కూడా జరిగింది. వచ్చే నెలలోనే మా పెళ్లి అని కూడా మీ అందరి ముందూ నిర్ణయమయింది" అన్నాడు.

అవునూ, ఇదంతా మాకు తెలియదా? అన్నట్లు ముఖాలు పెట్టి వింటున్నారు అందరూ. వాళ్ల ముఖాల్లోని ఆ భావాల్ని నేను స్పష్టంగా గమనిస్తున్నాను.

వరుడు సుధాకర్ తన మాటలని కొనసాగిస్తున్నాడు. "ఈ రోజు నిశ్చితార్థానికి వచ్చిన వారందరూ దాదాపు రెండు వందల మంది వున్నారు. మాకు అతి దగ్గరి బంధువులూ, ఆత్మీయులూ అందరూ ఈ శుభ సమయంలో ఇక్కడున్నారు. వచ్చే

నెలలో జరిగే పెళ్లికి మళ్లీ మీరే వస్తున్నారు. మీరే మమ్మల్ని ఆశీర్వదిస్తారు. ఏమిటి ఈ కుర్రవాడు ఇలా మాట్లాడుతున్నారనుకుంటున్నారేమో, సరే అసలు పాయింట్‌కు వస్తాను. నిశ్చితార్థమే ఇంత ఖర్చుతో హంగామతో, సందడితో జరిగింది కదా! రేపు జరిగే పెళ్ళి మరింత మందీ మార్బలంతో జరుగుతుంది కదా! పెళ్లి ఖర్చులంటే మాటలా! నాకంటే పెద్దలైన మీకు ఎక్కువ తెలుసు. కళ్యాణ మంటపం మొదలుకొని అంపకాల కార్యక్రమం వరకూ ఎంత శ్రమ, ఎంతెంత ఖర్చులు. మళ్ళీ మీరూ మేమే కలుసుకోవటం – మీకు, మాకూ మరీ ముఖ్యంగా మా అత్తమామలకూ ఎన్నెన్ని ఖర్చులు. ఎన్నెన్ని ప్రయాసలు. లక్షకు పైగానే అవుతుంది. మళ్లీ మా మామగారికి పెళ్ళి ఖర్చు."

ఏమిటీ కుర్రవాడు? ఈ ప్రసంగం అంతరార్థం? అని అందరూ ఒక వైపు నివ్వెర పోతూనే ఆసక్తిగా వింటున్నారు.

"పెద్దలారా, ఆత్మీయులారా, అందువల్ల నేను ఒక నిర్ణయానికి వచ్చినాను. మా మామగారికి ఈ ఖర్చునూ, శ్రమనూ తగ్గించటానికి ఇప్పుడు ఈ సమయంలోనే, ఈ వేదిక మీదనే నేను మాంగల్యధారణ చేయబోతున్నాను" అని గట్టిగా ప్రకటించి తన ప్యాంటు జేబు నుండి మంగళ సూత్రం తీసి చేతుల్లో పట్టుకొని అందరికీ చూపించాడు.

"మీ అందరూ ఆమోదించి, ఆశీర్వదిస్తానంటే పురోహితుని మంత్రోచ్చారణల సాక్షిగా నేను వధువుకు మాంగల్యధారణ చేస్తాను" అంటూ అందరి వేపు చూశారు.

అమ్మయ్య అన్నట్లు అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. పది నిమిషాల పాటు హాలంతా గుసగుసలు – న్యాయమే గదా, నిజమే గదా, పెళ్లికంతా రేపు వచ్చేది మనమే కదా. ఆ జరిగేదేదో ఇప్పుడే జరిగితే ఎంత శుభం? ఎన్ని వ్యయ ప్రయాసలు తగ్గుతాయి. ఇలా చర్చలు జరిగాయి, అందరి మధ్య కాసేపు. ఉన్నపళంగా అందరూ ఆమోదయోగ్యంగా చప్పట్లు చరిచారు. వెంకటరత్నం ముఖం ఆనందోత్సాహాలతో వెలిగిపోతోంది. ఇది కలా, వాస్తవమా? అన్న సందిగ్ధంలో పడిపోయారు. ఒక పెద్ద మనిషి లేచి నిలబడి "నాయనా! వయసులో చిన్నవాడివయినా, పెద్ద నిర్ణయం తీసుకున్నావు. ఆలస్యమెందుకు! శుభం! మాంగల్యధారణ చేసేయ్. అయ్యా! పురోహితులు మాంగల్యధారణ మంత్రాలు చదవండి" అన్నాడు సంతోష సంభ్రమాలతో.

వరుడు సుధాకర్ మళ్ళీ కొనసాగిస్తూ "మీ అందరి ఆమోదమే నాకు శిరోధార్యం. అయితే మరొక్కమాట సెలవిస్తాను. నేను ఇక్కడికి రాగానే మా గురువు గంగాధరం గారే అనేక విషయాలు నాకు వివరించి చెప్పి నాకు ఈ సూచన చేసినారు. ఈ మంగళ సూత్రాన్ని కూడా వారే తెప్పించి నాకు అందజేసినారు. వారి సంకల్పమూ సూచనా లేకపోతే నాకీ ఆలోచన కూడా వచ్చి వుండదు. వారి ఆశీర్వాద బలంతో, మీ అందరి అనుమతితో, మా తల్లిదండ్రుల, అత్తమామల అంగీకారంతో నేను మీ అందరి సమక్షంలో మాంగల్యధారణ చేస్తున్నాను" అని చెప్పి పురోహితుడు "మాంగల్యం తంతునానేనా" అని మంత్రోచ్ఛారణ చేస్తూండగా వధువు కళ్లలో మెరుపులు మెరుస్తూండగా సుధాకర్ మాంగల్యధారణ చేసి అందరికీ వినమ్రంగా నమస్కరించాడు.

"శుభం" అనుకున్నాను నేను కళ్లల్లో ఆనందాశ్రువులు జాలువారుతుండగా...

**❖ సాహిత్యనేత్రం, జులై 2006**